రాగం: మధ్యమావతి

తాళం: ఆది

చూడరమ్మ సతులాల సోబాన బాడరమ్మ
కూడున్నది పతి చూడికుడుత నాంచారి

1. శ్రీమహాలక్ష్మియట సింగారాల కేమరుదు
కాముని తల్లియట చక్కదనాల కేమరుదు
సోముని తోబుట్టువట సొంపు గళల కేమరుదు
కోమలాంగి ఈ చూడికుడుతనాంచారి

2. కలశాబ్ధికూతురట గంభీరాల కేమరుదు
తలప లోకమాతయట దయ మరి యేమరుదు
జలజనివాసినియట చల్లదన మేమరుదు
కొలదిమీర ఈ చూడికుడుతనాంచారి

3. అమరవందితయట అట్టే మహి మేమరుదు
అమృతము చుట్టమట ఆనందాల కేమరుదు
తమితో శ్రీవేంకటేశు దానె వచ్చి పెండ్లాడె
కొమెరవయసు ఈ చూడికుడుతనాంచారి